విపణిలోకి స్కోడా కైలాక్ ఎస్‌యూవీ

ప్రారంభ ధర రూ.7.89 లక్షలు

న్యూఢిల్లీ, జనవరి 27: ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేసే ఉద్దేశంలో భాగంగా స్కోడా..కైలాక్ మాడల్‌ను దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో పోటీని మరింత తీవ్ర తరం చేయాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ కారు ప్రారంభ ధర రూ.7.89 లక్షలుగా నిర్ణయించింది. 1.0 టీఎస్ఐ ఇంజిన్‌తో తయారైన ఈ కారు లీటర్ పెట్రోల్‌కు 19.68 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. క్లాసిక్, సిగ్నిచర్, సిగ్నిచర్+, ప్రిస్టేజ్ వంటి నాలుగు రకాల్లో లభించనున్న ఈ కారుకు 5 స్టార్ రేటింగ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, 25 బలమైన భద్రత ఫీచర్లు ఉన్నాయని స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పెట్రా జనేబా తెలిపారు. కేవలం 10.5 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 188 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఈ కారుపై మూడేండ్లు లేదా లక్ష కిలోమీటర్ల వ్యారెంటీ సదుపాయాన్ని కల్పిస్తున్నది.

కెనరా బ్యాంక్ లాభం 4,104 కోట్లు

కే సత్యనారాయణ రాజు
కెనరా బ్యాంక్
ఎండీ, సీఈవో

న్యూఢిల్లీ, జనవరి 27: ప్రభుత్వరంగ ఆర్థిక సేవల సంస్థ కెనరా బ్యాంక్ ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.4,104 కోట్ల స్టాండలోన్ నికర లాభాన్ని గడించింది. ఆదాయం పుంజుకోవడం, నిరర్థక ఆస్తులు తగ్గిపోవడంతో అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.3,656 కోట్ల లాభంతో పోలిస్తే 12.25 శాతం పెరుగుదల నమోదైందని వెల్లడించింది. బ్యాంక్ ఆదాయం కూడా రూ.32,334 కోట్ల నుంచి రూ.36,114 కోట్లకు ఎగబాకినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. స్థూల నిరర్థక ఆస్తుల విలువ 4.39 శాతం నుంచి 3.34 శాతానికి దిగొచ్చాయని, అలాగే నికర నిరర్థక ఆస్తుల విలువ కూడా 0.99 శాతం నుంచి 0.89 శాతానికి తగ్గినట్లు బ్యాంక్ ఎండీ, సీఈవో కే సత్యనారాయణ రాజు తెలిపారు.

- బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 2.85 శాతం తగ్గి రూ.9,149 కోట్లకు పరిమితమైంది.
- బ్యాంక్ గ్లోబల్ డిపాజిట్లు 8 శాతం పెరిగి రూ.13.69 లక్షల కోట్లకు చేరుకోగా, గ్లోబల్ అడ్వాన్స్‌లు 10 శాతం అధికమై రూ.10.49 లక్షల కోట్లకు చేరాయి. మొత్తం బ్యాంక్ గ్లోబల్ బిజినెస్ రూ.24.19 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

బీమాకు పన్ను నుస్తీ

ఆరోగ్య బీమా, ఔషధాలపై పన్నుల భారం తగ్గించాలన్న డిమాండ్లు

ఈసారి బడ్జెట్‌లోనైనా ఊరట లభించేనా?

న్యూఢిల్లీ, జనవరి 27: ఆరోగ్య సంరక్షణ, ఔషధ రంగాలు ఈసారి బడ్జెట్‌పై భారీ అంచనాల్నే పెట్టుకున్నాయి. సగటు మనిషి సైతం ఖరీదెక్కిన వైద్య చికిత్సల నుంచి ఉపశమనాన్ని ఆశిస్తున్నాడు. ఈ క్రమంలోనే రాబోయే బడ్జెట్‌లో ఔషధాలపై పన్నులను తగ్గించాలని, ఆరోగ్య బీమాపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)కు సంబంధించి పడుతున్న భారాన్ని కట్టడి చేయాలన్న డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి. దేశంలో ఇప్పటికీ చాలామందికి ఆరోగ్య బీమా లేదన్న విషయాన్ని ఇన్సూరెన్స్ ఇండస్ట్రీ కూడా గుర్తుచేస్తున్నది. పన్నులకు కోత పెడితే అందరికీ సులువుగా బీమా ప్రయోజనాలు అందుతాయంటున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టబోతున్నారు. నిర్మలా సీతారామన్‌కు ఇది ఎనిమిదో బడ్జెట్ కానుండగా, వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ సర్కారుకు రెండోది. అయితే గత ఏడాది ఎన్నికల నేపథ్యంలో ఈ దఫాకు ఇదే తొలి పూర్తిస్థాయి బడ్జెట్ కానున్నది.

ప్రోత్సాహకాలివ్వాలి

ప్రజారోగ్య సదుపాయాలకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు, ప్రైవేట్ రంగానికి ఇతర ప్రోత్సాహకాలను అందిస్తే సామాన్యులకు నాణ్యమైన ఆరోగ్య సేవలు దక్కుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆరోగ్య సంరక్షణ సేవలపై ఇన్‌పుట్ జీఎస్టీని తగ్గించాలంటున్నారు. ప్రీమియంలతో పోల్చితే వాటి క్లెయింల విలువ ఎక్కువని, కాబట్టి బీమా ఇండస్ట్రీకి ప్రోత్సాహకాలు లభిస్తే బాగుంటుందని చెప్తున్నారు.

సెక్షన్ 80డీ

ఐటీ చట్టంలోని సెక్షన్ 80డీ కింద ప్రస్తుతం వ్యక్తిగత కుటుంబ ఆరోగ్య బీమా కొనుగోలుపై 25,000 వరకు పన్ను మినహాయింపును కోరవచ్చు. ఒకవేళ ట్యాక్స్‌పేయర్ వయసు 60 ఏండ్లు దాటితే ఇది రూ.50,000గా ఉన్నది. అలాగే తల్లిదండ్రుల కోసం తీసుకునే ఆరోగ్య బీమాకూ మరో రూ.25,000 వరకు పన్ను మినహాయింపును అందుకోవచ్చు. వారి వయసు 60 ఏండ్లు దాటితే ఈ ప్రయోజనం రూ.50,000. మొత్తంగా ఆరోగ్య బీమాలకు ఏటా చేసే చెల్లింపుల్లో గరిష్ఠంగా లక్ష రూపాయలదాకా పన్ను మినహాయింపులు తీసుకోవచ్చు. అయితే ద్రవ్యోల్బణం దృష్ట్యా ఎక్కువ ప్రయోజనాలున్న సమగ్ర పాలసీలనే ఇప్పుడు తీసుకోవాల్సి వస్తున్నది. వాటి ప్రీమియంలూ ఎక్కువే. అందుకే ఈసారి బడ్జెట్‌లో ఈ పన్ను మినహాయింపులను ఇంకా పెంచాలన్న డిమాండ్లు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. కాగా, సెక్షన్ 80డీ కింద ట్యాక్స్‌పేయర్స్ తమపై ఆధారపడిన దివ్యాంగుల వైద్య చికిత్సకు చేసే చెల్లింపులకుగాను ఏటా రూ.1.25 లక్షలదాకా పన్ను మినహాయింపును అందుకోవచ్చు. వ్యక్తిగత వైద్య చికిత్స ఖర్చులకూ సెక్షన్ 80డీడీబీ కింద లక్ష రూపాయల వరకు క్లెయిం చేసుకోవచ్చు.

ఎన్పీఐ నివేదిక..

ఇక టర్మ్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై జీఎస్టీ, పన్నుల మినహాయింపును ప్రభుత్వం పరిశీలిస్తున్నదని ఎన్పీఐ రిసెర్చ్ చెప్తున్నది. వైద్య పరికరాలపై జీఎస్టీ రేట్లు 5, 12 శాతం మించకుండా నిర్ణయం రావచ్చని తెలుస్తున్నది. ప్రస్తుతం 18 శాతం పడుతున్నది. కాగా, 'టర్మ్/పూర్తి జీవిత బీమా, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీ లేదా ఎలాంటి పన్నులు ఉండరాదు' అని ఎన్పీఐ తమ రిపోర్ట్‌లో పేర్కొన్నది. ఎన్పీఎస్‌కు వీలుగా పాత/కొత్త పన్ను విధానాల్లో జీవిత, ఆరోగ్య బీమా కోసం ప్రత్యేకంగా పన్ను మినహాయింపు రూ.25,000, 50,000 ఉండాలంటున్నది. ఇదే క్రమంలో ఏపీవై, పీఎం-ఎస్‌వైఎం, పీఎం-కేఎంవై, ఎన్పీఎస్-ట్రేడర్లు వంటి అన్ని ప్రభుత్వ స్పాన్సర్డ్ పెన్షన్ స్కీములను ఒకే గొడుగు కిందకు తీసుకురావచ్చన్న అంచనాలు కూడా ఉన్నాయి.

పాత పన్ను విధానానికి స్వస్తి?

ప్రస్తుతం ఆదాయ పన్ను చెల్లింపుదారులకు పాత, కొత్త పన్ను విధానాలు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. ఐదేండ్ల కిందట కొత్త పన్ను విధానాన్ని పరిచయం చేసిన కేంద్ర ప్రభుత్వం.. ఏటా దాన్ని మరింత ఆకర్షణీయంగా మారుస్తూ రకరకాల ప్రోత్సాహకాలు, మినహాయింపుల్ని ఇస్తున్న సంగతీ విదితమే. ఈ క్రమంలో పాత పన్ను విధానం ఉండనున్నది. ఆయా సెక్షన్ల కింద వివిధ రకాల పెట్టుబడులు, పొదుపు, ఖర్చులపై ట్యాక్స్ పేయర్స్ పాత పన్ను విధానంలో పన్ను మినహాయింపుల్ని క్లెయిం చేసుకోవచ్చు. కానీ కొత్త పన్ను విధానంలో ఇవేవీ ఉండవు. వార్షిక ఆదాయం నిర్ణీత పరిమితి దాటిందంటే ఏ మినహాయింపులకు తావు లేకుండా అందరికీ ఆయా శ్లాబుల ప్రకారం పన్నులు వర్తిస్తాయి. మరోవైపు పాత పన్ను విధానాన్ని ఒకేసారి ఎత్తేయకుండా, మైనా పాత పన్ను విధానాన్ని తొలగిస్తే మదుపు, పొదుపులకు పెద్దగా ఎవరూ ఆసక్తి కనబర్చకపోవచ్చన్న వాదనలు వస్తుండటం గమనార్హం. ముఖ్యంగా మధ్యతరగతి ఉద్యోగులకు నష్టమేనంటున్నారు. ఇక ట్యాక్స్‌పేయర్స్ ఐటీఆర్‌లను దాఖలు చేసేటప్పుడు కొత్త పన్ను విధానమే డీఫాల్ట్‌గా సెలెక్టై ఉంటుంది. దీన్ని గుర్తించి పాత పన్ను విధానాన్ని ట్యాక్స్‌పేయర్సే ఎంచుకోవాలి. లేదంటే ఐటీ రిటర్నులు కొత్త పన్ను విధానంలోనే ఫైలింగ్ జరిగిపోతాయి.

జపాన్‌తో ద్వైపాక్షిక సంబంధాలకు రెడీ

రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జనవరి 27(నమస్తే తెలంగాణ): జపాన్‌లోని అయిచీ రాష్ట్రం జపాన్‌తో వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలకు తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం పలుకుతున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. అయిచీ అడ్మినిస్ట్రేవ్ డిస్ట్రిక్ ఆఫ్ జపాన్‌కు చెందిన ప్రతినిధులతో మంత్రి సోమవారం సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అయిచీ అసెంబ్లీ సభ్యుడు, ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించిన హిరోహితో కొండో ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే ఏడాది తమ రాష్ట్రంలో జరిగే 20వ ఆసియా క్రీడలకు రావాలని మంత్రి శ్రీధర్ బాబును ఆహ్వానించారు.

క్రెడిట్ కార్డులకు డిమాండ్

ముంబై, జనవరి 27: దేశవ్యాప్తంగా క్రెడిట్ కార్డుల సంఖ్య అమాంతం పెరిగింది. గడిచిన ఐదేండ్లలో కార్డుల సంఖ్య రెండింతలు పెరిగినట్లు రిజర్వుబ్యాంక్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. డిసెంబర్ 2019లో 5 కోట్లుగా ఉన్న క్రెడిట్ కార్డులు ప్రస్తుతం 10.80 కోట్లకు చేరుకున్నాయని, ఇదే సమయంలో డెబిట్ కార్డులు మాత్రం యథాతథంగా ఉన్నాయని పేర్కొంది. అలాగే డిజిటల్ చెల్లింపులు కూడా రాకెట్ వేగంతో దూసుకుపోతున్నాయి. ఐదేండ్ల క్రితం 80.53 కోట్లుగా ఉన్న డెబిట్ కార్డులు ప్రస్తుతం 99.08 కోట్లకు చేరుకున్నాయి.

హట్సన్ జహీరాబాద్ ప్లాంట్ విస్తరణ

హైదరాబాద్, జనవరి 27: అరుణ్ ఐస్‌క్రీం పేరుతో ఐస్‌క్రీం ఉత్పత్తులను విక్రయిస్తున్న హ్యాట్సన్ ఆగ్రో ప్రొడక్ట్ లిమిటెడ్..జహీరాబాద్ ప్లాంట్ సామర్థ్యాన్ని భారీగా పెంచుకున్నది. గతంలో రోజుకు లక్ష కిలోల ఐస్‌క్రీంలను ఉత్పత్తి అవుతున్న ఈ ప్లాంట్ సామర్థ్యాన్ని 1.27 లక్షల కిలోలకు పెంచుకున్నట్లు కంపెనీ చైర్మన్ ఆర్‌జీ చంద్రమోగన్ తెలిపారు. దీంతో ఈ యూనిట్ దేశంలో అతిపెద్ద ఐస్‌క్రీం యూనిట్ కావడం విశేషమన్నారు. దీంతో గ్రూపు టర్నోవర్ బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. అలాగే హైదరాబాద్‌లోని సూరారం వద్ద రోజుకు 2.8లక్షల లీటర్ల పాలను కలుపుకొని 20 ప్లాంట్లలో రోజుకు 32 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నదని చెప్పారు.

మార్కెట్లో ట్రంప్ క్రాష్

ముంబై, జనవరి 27: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీగా నష్టపోయాయి. అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మళ్లీ పరస్పర సుంకాల సమరానికి కాలుదువ్వుతున్నట్టు సంకేతాలు రావడంతో మదుపరులు ఒక్కసారిగా భయాందోళనకు లోనయ్యారు. ఈ క్రమంలోనే అమ్మకాల ఒత్తిడిలోకి జారుకోగా.. అటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్, ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ రెండూ పెద్ద ఎత్తున క్షీణించాయి. సెన్సెక్స్ 824.29 పాయింట్లు లేదా 1.08 శాతం కోల్పోయి 76వేల స్థాయికి కిందకు 75,366.17 వద్ద ముగియగా, నిఫ్టీ 263.05 పాయింట్లు లేదా 1.14 శాతం పడిపోయి 23వేల స్థాయికి దిగువన 22,829.15 వద్ద స్థిరపడింది. దీంతో గత ఏడాది జూన్ నుంచి ఈ స్థాయిల్లోకి సూచీలు క్షీణించడం ఇదే తొలిసారైంది. ఒకానొక దశలోనైతే సెన్సెక్స్ 922.87, నిఫ్టీ 305.30 పాయింట్లు పతనమయ్యాయి.

9.28 లక్షల కోట్ల సంపద ఆవిరి

ఈ ఒక్కరోజే బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.9,28,229.09 కోట్లు హరించుకుపోయింది. చివరకు రూ.4,10,23,624.90 కోట్ల వద్ద ఆగింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 3.51 శాతం, మిడ్‌క్యాప్ 2.68 శాతం మేర నష్టపోయాయి. ఐటీ, టెక్నాలజీ, మెటల్, హెల్త్‌కేర్, ఇండస్ట్రియల్స్, చమురు-గ్యాస్ షేర్లు 3.31 శాతం నుంచి 2.41 శాతం వరకు నష్టపోయాయి. ఇదిలా ఉంటే ఈ ఏడాది మొదలు బీఎస్ఈలో ఇన్వెస్టర్ల సంపద 32 లక్షల కోట్లకుపైగా కరిగిపోయింది.

సర్వే డబ్బులు ఎప్పుడిస్తరో?

ఎదురు చూస్తున్న బల్దియా ఎన్యుమనేటర్లు

వరంగల్, జనవరి 27 : సమగ్ర కుటుంబ సర్వే చేసిన ఎన్యుమనేటర్లకు ప్రభుత్వం ఇప్పటి వరకు డబ్బులు చెల్లించలేదు. దీంతో వారు రెండు నెలలుగా ఎదురు చూస్తున్నారు. డబ్బుల కోసం తిరుగుతున్నా బల్దియాలో తమకు సరైన సమాధానం చెప్పేవారు కరువయ్యారని ఎన్యుమనేటర్లు వాపోతున్నారు. గత నవంబర్‌లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించగా ఒక్కో ఎన్యుమనేటర్‌కు 150 నుంచి 175 గృహాలు అప్పగించారు. ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున చెల్లిస్తామని చెప్పిన అధికారులు ఇప్పటి వరకు ఇవ్వలేదని వారు వాపోతున్నారు. బ్యాంక్ అకౌంట్ వివరాలు అందజేసి నెల రోజులు గడుస్తున్నా డబ్బులు మాత్రం వేయలేదని అంటున్నారు.

అటెండెన్స్ సర్టిఫికెట్లు ఇవ్వలేదు

సమగ్ర కుటుంబ సర్వే చేసిన ఉద్యోగులకు అటెండెన్స్ సర్టిఫికెట్లు ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఎన్ని రోజులు సర్వే విధులు నిర్వహించారనేది తేదీలతో సహా అందజేయాల్సి ఉంటుంది. ఆ రోజుల్లో ఉన్న సాధారణ సెలవులను సీసీఎల్‌గా 6 నెలల్లో వినియోగించుకునే అవకాశం ఉంటుంది. అయితే బల్దియా అధికారులు ఇప్పటి వరకు సర్టిఫికెట్లు ఇవ్వలేదని ఉద్యోగులు చెప్తున్నారు.

అనుమానాస్పదంగా లారీ డ్రైవర్ మృతి

భూపాలపల్లి రూరల్, జనవరి 27 : భూపాలపల్లిలోని కాసింపల్లికి చెందిన లారీ డ్రైవర్ కందుల సురేశ్(37) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు భూపాలపల్లి సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు. ఆదివారం రాత్రి సురేశ్ తన ఇంట్లో నిద్రించాడని, సోమవారం ఉదయం లేచేసరికి నోటి నుంచి నురుగా కారుతూ చనిపోయి ఉన్నాడని మృతుడి తల్లి సుగుణ తెలిపారు. తన కొడుకు మరణం విషయంలో కోడలు స్వప్నపై అనుమానం ఉందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

47వ సారి అశోక్ రక్తదానం

శాయంపేట, జనవరి 27 : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన తెలంగాణ యువత రాష్ట్ర నాయకుడు అమ్మ అశోక్ 47వ సారి రక్తదానం చేశారు. సోమవారం పరకాల ప్రభుత్వ దవాఖాన నుంచి పేషెంట్ చంద్రయ్యకు బ్లడ్ అవసరం ఉందని ఫోన్ రాగా, అశోక్ స్పందించి వెళ్లి రక్తదానం చేశారు. దవాఖాన ఆర్ఎంవో బాలకృష్ణ అశోక్‌ను అభినందించి సర్టిఫికెట్ అందజేశారు.

అశోక్‌కు సర్టిఫికెట్ అందిస్తున్న ఆర్ఎంవో

రోడ్డు ప్రమాదంలో ధరణి ఆపరేటర్‌కు తీవ్ర గాయాలు

మహదేవపూర్, జనవరి 27 : రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్‌కు తీవ్ర గాయాలైన ఘటన జనగాయ జల్లా స్టేషన్‌ఘనపూర్ సమీపంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే మహదేవపూర్ ధరణి ఆపరేటర్ వెంకటేశ్ తోటి సమీప మండల ధరణి ఆపరేటర్లతో కలిసి ఉద్యోగ భద్రతతో పాటు గత 8 నెలలుగా జీతాల కోసం ఉన్నతాధికారులను కలిసి విన్నవించేందుకు కారులో హైదరాబాద్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో స్టేషన్‌ఘనపూర్ సమీపంలో ప్రధాన రహదారిపై ఓ డీసీఎం వ్యాన్ అడ్డు రావడంతో అదుపుతప్పి కారు ఫీవైడర్‌ను ఢీకొట్టింది. వెంకటేష్ తలకు తీవ్రగాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని అంబులెన్స్‌లో వరంగల్ దవాఖానకును తరలించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు దవాఖానను వెళ్లి పరామర్శించారు.

స్వోకెన్ ఇంగ్లిష్ దరఖాస్తుల గడువు పొడిగింపు

హనుమకొండ చౌరస్తా, జనవరి 27 : కాకతీయ విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ (సెల్ట్) ఆధ్వర్యంలో నిర్వహించబోయే 'స్వోకెన్ ఇంగ్లిష్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్' తరగతుల దరఖాస్తు గడువుని ఫిబ్రవరి 1 వరకు పొడిగిస్తూ సంచాలకులు మేఘనారావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సెమిస్టర్ పరీక్షల దృష్ట్యా ఈ గడువు పొడిగిస్తున్నట్లు, వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ లేదా క్యాంపస్‌లోని సెల్ట్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రోడ్డు విస్తరణతో విగ్రహ ఏర్పాటుకు బ్రేక్



నిర్మాణంలో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం

హనుమాన్ ఆలయాన్ని కూడా తొలగించాల్సిందే.. ఎన్‌హెచ్ డీఈఈ కుమారస్వామి

ఏటూరునాగారం, జనవరి 27 : ఏటూరునాగారంలోని అటవీశాఖ చెక్‌పోస్టు నుంచి వై జంక్షన్ వరకు నాలుగు లేన్ల జాతీయ రహదారి విస్తరణ పనులతో క్రాస్‌రోడ్డులోని ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు బ్రేక్ పడింది. రోడ్డు పనులకు అడ్డుగా ఉండడంతో ప్రస్తుతం గుడి పక్కనే 35 అడుగుల ఎత్తుతో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి విగ్రహం పనులను నిలిపివేయాలని హైవే అధికారులు సూచించారు. ఈ మేరకు జాతీయ రహదారి విభాగం డీఈఈ కుమారస్వామితో స్థానిక నాయకులు, ఆలయాల కమిటీ చైర్మన్లు, గ్రామస్తులు సోమవారం చర్చించారు. క్రాస్‌రోడ్డులో ఉన్న హనుమాన్ గుడిని తొలగించాల్సి ఉంటుందని డీఈఈ తెలిపారు. కాగా, సుమారు 70 ఏళ్లుగా ఇక్కడ గుడి ఉందని, దాన్ని తొలగిస్తే ఎలా అని గ్రామస్తులు ప్రశ్నించారు. కాగా, రోడ్డు విస్తరణ చేయాల్సి ఉన్నందున మరో చోట నిర్మించుకోవాలని అధికారులు సూచించారు. అయితే, చెక్ పోస్టు నుంచి కాకుండా గుడి దాటిన తర్వాత రోడ్డు విస్తరించాలని గ్రామస్తులు కోరారు. ఈ విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడుతామని, అప్పటి వరకు విగ్రహ నిర్మాణ పనులను అడ్డుకోవద్దని గ్రామస్తులు డీఈఈని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు ఇర్సవడ్ల వెంకన్న, గండపెల్లి సత్యం, వినుకోలు చక్రవర్తి, కాకులమర్రి ప్రదీప్‌కుమార్, తాడూరి రఘు, మైనార్టీ నాయకుడు ఖాజాపాషా, పీఏసీఎస్ వైర్మన్ కూనూరు అశోక్, వైస్ వైర్మన్ బాలరాజు, సాయిబాబా ఆలయ కమిటీ వైర్మన్ పెండ్యాల ప్రభాకర్, రామాలయం కమిటీ వైర్మన్ అలువాల శ్రీనివాస్, నాయకులు గడదాసు సునీల్ కుమార్, తుమ్మ మల్లారెడ్డి, కాళ్ల రామకృష్ణ, గండపెల్లి నర్సయ్య, వావిలాల ఎల్లయ్య, దన్నపునేని కిరణ్, సప్పిడి రాంనర్సయ్య, కుమ్మరి చంద్రబాబు, పాలకుర్తి శ్రీనువాస్, బాసాని శేఖర్ పాల్గొన్నారు.

ఏఎస్సై ఉద్యోగోన్నతి అర్హత పరీక్ష పరిశీలన

మడికొండ, జనవరి 27 : మడికొండలోని నగర పోలీస్ శిక్షణ కేంద్రంలో హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్సైలుగా ఉద్యోగోన్నతి కోసం నిర్వహిస్తున్న అర్హత పరీక్షను సోమవారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రాద్రి, కాళేశ్వరం జోన్ల పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న 108 మంది సివిల్ హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్సైలుగా ఉద్యోగోన్నతి కోసం అర్హత పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం శిక్షణకు వచ్చే సిబ్బంది సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డులను ప్రారంభించారు. కార్యక్రమంలో 4వ బెటాలియన్ కమాండెంట్ రాంప్రకాశ్, అదనపు డీసీపీ రవి, వైస్ ప్రిన్సిపాల్ రమణబాబు, ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, పుల్యాల కిషన్ పాల్గొన్నారు. అలాగే మడికొండ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పరిసరాలను పరిశీలించారు. స్టేషన్‌ను సుందరంగా తీర్చిదిద్దిన ఇన్‌స్పెక్టర్ కిషన్‌ను అభినందించారు.

పరీక్షను పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

'కాంట్రాక్ట్ అధ్యాపకులకు న్యాయం చేయాలి

కాలేజీ ఎదుట నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు అధ్యాపకులు

హనుమకొండ చౌరస్తా, జనవరి 27 : కాంట్రాక్ట్ అధ్యాకులకు న్యాయం చేసిన తర్వాతే రిక్రూట్‌మెంట్ చేపట్టాలని కేయూ కాంట్రాక్ట్ అధ్యాపకో ఆర్డినేషన్ కమిటీ నాయకుడు సాదు రాజేశ్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాల వద్ద కాంట్రాక్ట్ అధ్యాపకులు నిరసన తెలిపారు. వెంటనే పే స్కేల్స్ అమలు చేయాలని, తమను క్రమబద్ధీకరణ చేసిన తర్వాతే యూనివర్సిటీల్లో పోస్టులను భర్తీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టిన అంశాన్ని అమలు చేయాలని అన్ని వర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకులు కోరారు. తమకు న్యాయం చేయకపోతే రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. సతీశ్, సత్య, నాగేశ్వర రావు, రఘువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్, సూర్యనారాయణ, వెంకటగోపీనాథ్, రంజిత్, వెంకటేశ్, వీణ, సాహితీ, స్వప్న, దీప్తి, వాణిశ్రీ పాల్గొన్నారు.

కాళేశ్వర ముక్తీశ్వర ఆలయ ఈవోగా మహేశ్

మహదేవపూర్(కాళేశ్వరం), జనవరి 27: కాళేశ్వర ముక్తీశ్వర ఆలయ ఈవోగా మహేశ్ నియమితులయ్యారు. ఇటీవల గర్భగుడిలో అనుమతి లేకుండా మధుప్రియ పాట చిత్రీకరణ ఘటనతో అప్పుడు ఈవోగా పనిచేసిన మారుతిని బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయన కరీంనగర్ జిల్లా గట్టుదుద్దెనసల్లి ఆంజనేయస్వామి ఆలయానికి బదిలీ కాగా, గతంలో ఇక్కడ పని చేసి, బదిలీపై కోటంచ ఆలయానికి వెళ్లిన గ్రేడ్-1 అధికారి మహేశ్‌కు ఈవోగా బాధ్యతలను అప్పగించారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న మహేశ్

సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ విఫలం

దుడ్డెకు వినతి పత్రం ఇచ్చిన బీఆర్ఎస్ నేతల నిరసన

దుడ్డెకు వినతిపత్రం ఇస్తున్న తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు

శాయంపేట, జనవరి 27: ప్రజా సమస్యల పరిష్కారంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ, బీఆర్ఎస్ జిల్లా నాయకులు అరికెళ్ల ప్రసాద్, మండల యూత్ అధ్యక్షులు మారేపల్లి మోహన్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా శాయంపేటలో ప్రజాపాలన విఫలమైందని దుడ్డెకు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తుందని అన్నారు. అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులకు కాలం చెల్లిందని, కనీసం 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా అంబేద్కర్‌కి నివాళులర్పించని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు సరికాదని అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రజలకు పథకాలను అమలు చేస్తామని చెప్పి మళ్లీ మాట మారుస్తూ కాలయాపన చేస్తున్నారని, ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో ఒక్క సీటు కూడా రాదని విమర్శించారు. రైతు భరోసా, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు జారీ, ఇందిరమ్మ ఇల్లు ఇవన్నీ బోగస్ అని, కేవలం స్థానిక ఎలక్షన్స్ స్టంట్ మాత్రమే అని ఆరోపించారు. ఇప్పటివరకు ఒక